క్లుప్తంగా

సామూహిక ఒడి బియ్యం


సామూహిక ఒడి బియ్యంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని ఆయుష్ యోగా కేంద్రంలో గురువారం ప్రముఖ యోగ గురువు కండే ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ శ్రీసత్య సాయిబాబా శతజయంత్యుత్సవాలను పురస్కరించుకొని 30 మంది మహిళలకు సామూహిక గోధుమలతో ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనంద్ గురూజీ మాట్లాడుతూ శ్రావణ మాసంలో మహిళలకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మహాలక్ష్మికి పూజ చేసినంత ఫలితం వస్తుందన్నారు. నిశ్చలమేట్ల సుబ్బరామయ్య, వసుమతి, సులోచన, అపర్ణ, ఇందుమతి,సుమలత,సౌమ్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఉన్న ఆటో డ్రైవర్లకు ఆటో స్టాండ్లు, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏపీ ఆటో వర్కర్స్ అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను పోలీసులు నేరస్తులుగా చిత్రీకరించే జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకంతో డ్రైవర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారయన్నారు. ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా రూ.25 వేలు ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, యూనియన్ నాయకులు లక్ష్మణ్, చైన్ సింగ్, నాగరాజు, ఓబులేసు, నాగేంద్ర పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోండి


మాట్లాడుతున్న ఎస్‌ఐ మహమ్మద్ రఫీ

రుద్రవరం: వినాయక ఉత్సవాల సందర్భంగా మండలపాల ఏర్పాటుకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆయన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతూ ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేకంగా వెబ్ సైట్‌ను పారంభించిందన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. అనంతరం పోలీసులు మండప స్థలాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే అనుమతులు ఇస్తామన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని అందజేస్తామన్నారు.

విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈనెల 13న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో పి.నాగేంద్ర, మహమ్మదుశ్శేన్‌లు 2వ స్థానంలో నిలిచారన్నారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 10 టీంలు పాల్గొన్నాయన్నారు.

బాల్య వివాహాలు నేరం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమని

నంద్యాల (వ్యవసాయం): బాల్య వివాహాలు చేసినా, చేసుకున్నా నేరమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమని అన్నారు. గురువారం స్థానిక ఎస్టీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి బాలికలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు లక్ష్యాలను నిర్దేశించుకొని శ్రమించాలని చెప్పారు. అలాగే కౌమార దశలో బాలికలకు వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, వార్డెన్ ,ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మినుము రైతు విలవిల

- వర్షాలతో దెబ్బతిన్న పంట
- ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు రాక ఇబ్బందులు
- పంట చేతికొచ్చాక వర్షంతో నష్టం
- అరకొరగా దిగుబడి
- గిట్టుబాటు ధరలేక నష్టాలు


గోస్పాడు సమీపంలో దెబ్బతిన్న మినుము పైరును చూపుతున్న రైతు


శ్రీనివాసపురం వద్ద కుళ్లిపోయిన మినుము పైరు

గోస్పాడు: రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ముందస్తుగా వరుణుడు కరుణించడంతో రైతులు పంటలు సాగు చేశారు. ఆ తరువాత చినుకు కరువవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. ఎట్టకేలకు పంట చేతికొచ్చిన సమయంలో వీడని వర్షాలతో మినుము రైతుకు నష్టాలు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితులతో దిగుబడి పూర్తిగా పడిపోయింది. సాధారణంగా ఎకరాకు 8–10 క్వింటాళ్ల వరకు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం 2 క్వింటాళ్లకు మించి రావడం లేదు. అలాగే మార్కెట్‌లో ప్రారంభంలో క్వింటా ధర రూ.7వేలు ఉండగా.. వ్యాపారులు కుమ్మక్కై రూ.3వేల నుంచి రూ.4వేలకు మించి కొనడం లేదు. ఇదిలా వుండగా.. వీడని వర్షాలతో చేతికొచ్చిన పంట వర్షార్పణమైంది. మండలంలోని యాళ్లూరు, జిల్లెల్ల, ఎం.చింతకుంట్ల, సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, నెహ్రూనగర్, జూలేపల్లె, గోస్పాడు తదితర గ్రామాల్లో జూన్‌లో కంది, మినుము, పెసర, సోయాబీన్, మొక్కజొన్న వంటి సాగుచేశారు. అయితే వరుణుడు ముఖం చాటేయడంతో అవస్థలు పడ్డారు. ఒక దశలో పైర్లు ఎండిపోతుండటంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. మండలంలో మినుము సాధారణ సాగు విస్తీర్ణం 736 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1,507 హెక్టార్లలో సాగు చేశారు.

పెట్టుబడులు నేలపాలు..

మినుము సాగుకు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15వేలు వరకు వెచ్చించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఎట్టకేలకు పంట చేతికొచ్చింది. కోత కోసే సమయంలో అల్పపీడన ప్రభావంతో ఎడతెరపి లేని వర్షాలతో నూర్పిడి సాధ్యం కాలేదు. దీంతో పంట పొలంలో నీరు నిల్వ చేరి పైరు కుళ్లిపోయింది. ఇప్పటికే నూర్పిడి చేసిన రైతులకు కూడా మార్కెట్లో సరైన గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నారు. మొదట్లో క్వింటా ధర రూ.7వేల దాకా ఉండగా వర్షాలు పడుతున్న కొద్ది ధాన్యం రకాన్ని బట్టి వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో క్వింటా ధర రూ.3,500 మొదలు రూ.4500కే కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో కర్షకులకు పాలుపోవడం లేదు. సాగైన పంటలో కేవలం 20 మాత్రమే కోతలు పూర్తవగా.. 80 శాతం పంట వర్షానికి దెబ్బతినింది. వేలాది రూపాయల పెట్టుబడి వర్షార్పణమైందని వారు వాపోతున్నారు.

సరైన దిగుబడి లేదు



సీజన్ ప్రారంభంలో 15ఎకరాల్లో మినుము పంట సాగుచేశా. ఇందుకు ఎకరాకు రూ.12వేలకు పైగా ఖర్చు చేయాల్సి వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో రోజుల తరబడి వర్షాలు కురవడంతో దిగుబడి దెబ్బతినింది. ఇప్పటికే కోతలు పూర్తయిన వారిక ఎకరాలకు 2 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. మార్కెట్లో సరైన ధర లేక అవస్థలు పడుతున్నాం. – నాగేశ్వరరెడ్డి, సాంబవరం

గిట్టుబాటు ధర లేక నష్టాలు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందుగా మినుము సాగు చేశా. ముందు నుంచి అంతంత మాత్రంగానే ఉన్నా కోత సమయంలో వర్షం దెబ్బతీసింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. దీంతో నష్టాలే మిగిలాయి. దిగుబడులు కూడా అంతంత మాత్రమే ఉండగా క్వింటా ధర రూ.4వేలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నాం.
– ప్రసాద్‌యాదవ్, పసురపాడు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని శ్రీ చంద్రశేఖర కాళికాంబ దేవస్థానంలో శ్రీ కాళీమాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం, పూజల అనంతరం పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి పెళ్లిపీటలపై ఆశీనులు గావించారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుక జరిపించారు. చివరగా..మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు. ఈఓ లక్ష్మి నారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయకుమార్, రమేష్ ,హరి,సుబ్రహ్మణ్య శాస్త్రి, నరసింహ, తిమ్మయ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని రైతు సంఘం నాయకుడు మార్క్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలనే పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, గ్రాట్యుటీ సవరణ చేయాలని కోరారు. అనంతరం ఆర్‌ఐకి వినతి పత్రం అందజేశారు. జిల్లా ఆఫీస్ బేరర్ నిర్మలమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు రమణమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

శిరివెళ్ల: తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్లు గురువారం తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు వసుంధర మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వ పథకాలకు దూరం చేయడం తగదన్నారు. యాప్‌ల భారం తగ్గించి, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హామీని నెరవేర్చాలి

ఉయ్యాలవాడ: కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సువర్ణాదేవికి వినతిపత్రం అందజేశారు.


తహసీల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

- దొర్నిపాడు: వేతనాలు పెంచాలని కోరుతూ మండల అంగన్‌వాడీ వర్కర్లు గురువారం తహసీల్దార్ సుభద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు ఉదయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు మాధవీ, వెంకటసుబ్బమ్మ, అరుణకుమారి, తులసీ, రాజేశ్వరి మార్తమ్మ, సుభాషిణి పాల్గొన్నారు.

గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కార్యాలయం ప్రారంభం

నంద్యాల (వ్యవసాయం): వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక బైర్మల్ వీధిలోని ఉత్తరాది మఠంలో రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి,పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవాల కరపత్రాలను, కండువాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఈ నెల 27 – 31 తేదీ వరకు జరిగే ఉత్సవాలకు పట్టణంలోని 42 వార్డుల్లో 500 మండపాల ఏర్పాటుకానున్నాయన్నారు. మండపాల్లో భజనలు సంకీర్తనలు, హరికథలు, పౌరాణిక గాథలు, భక్తి ఆధ్యాత్మిక సంబంధించిన కార్యక్రమాలను మాత్రమే చేపట్టాలని సూచించారు. మైకులు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. నాగేంద్ర, చలం బాబు,అమర్నాథ్, సత్యనారాయణ, పాల్గొన్నారు .

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన ఓ మహిళపై అదనపు కట్నం కోసం వేధింపులు జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాల ప్రకారం.. గూటుపల్లెకు చెందిన నన్నూర్ లత అనే మహిళను ఏడాదిన్నర క్రితం మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన శశికుమార్‌తో వివాహం చేశారు. అయితే ఇటీవల భర్త శశికుమార్‌తో పాటు అత్త రత్నమ్మ, మామ నాగయ్యలు అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నారని లత ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

462 క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాకీన్స్‌లా నుంచి గురువారం 462 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల నుంచి 2,500 క్యూసెక్కుల నీటిని విడదలు చేశారని, శుక్రవారం ఉదయానికి లాకీన్స్‌లాను చేరుతుందని చెప్పారు. కాగా ప్రస్తుతం లాకీన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 62 క్యూసెక్కులు, తూడిచెర్ల ఎస్కేప్ చానల్(కేసీసీ)కు 400 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతుందన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్లు బంద్ చేసినట్లు తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరులకు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

23న పంచాయతీల్లో పరిశుభ్రతపై కార్యక్రమాలు

నంద్యాల(అర్బన్): స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రుతు పవనాలు– పరిశుభ్రతకు సంబంధించి వర్షాకాలంలో వరదలు, అంటు వ్యాధులు,కాలువలు శుభ్రం చేయడం వంటివి చేపట్టాలని ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు పంచాయితీ కార్యదర్శులు మురుగు నీటి కాల్వల్లో మట్టి, చెత్తను తొలగించడం, వర్షపు నీరు అడ్డంకులు లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య శాఖ బృందాలతో సమన్వయం చేసుకొని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోండి

శిరివెళ్ల: వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సీఐ దస్తగిరి బాబు సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన గణేష్ పండుగ శాంతి కమిటీ సమావేశంలో సీఐ మాట్లాడారు. గణేష్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ మండలపాల నిర్వాహకులు గణేషోత్సవ డాట్‌కం ఎన్‌ఈటీ వెబ్ సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ అనుమతులు పొందాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుకు ప్రత్యేక అనుమతి తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పండుగను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, మత పెద్దలు పాల్గొన్నారు.

అప్పీలు చేసుకోండి

శిరివెళ్ల: నోటీసులు అందుకున్న వికలాంగులు ఎంపీడీఓ కార్యాలయంలో అప్పీలు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ గురువారం తెలిపారు. అంగవైకల్యం తక్కువ ఉన్న వారికి ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేసిందన్నారు. నోటీసులు అందుకున్న వారు నోటీస్, మెడికల్ సర్టిఫికెట్లతో కూడిన అర్జీలను కార్యాలయ సిబ్బందికి అందజేయాలన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఉయ్యాలవాడ: మండలంలోని నలుగురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పదోన్నతిపై బదిలీ అయ్యారని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుచ్చకాయలపల్లె కార్యదర్శి చిన్న వుశేనయ్య దొర్నిపాడు మండలం కొండాపురానికి, తుడుమలదిన్నె కార్యదర్శి వెంకటేశ్వర్లు సంజామల మండలం కమలపురికి, సర్వాయిపల్లె కార్యదర్శి రవి ప్రకాష్‌రెడ్డి చాగలమర్రి మండలం గొడిగెనూరుకు, నర్సిపల్లె కార్యదర్శి మురళీకృష్ణ ఆళ్లగడ్డ మండలం ఎస్.లింగందిన్నె సచివాలయాలకు బదిలీ అయ్యారన్నారు. ఇప్పటి వరకు గ్రేడు–5 కార్యదర్శులుగా కొనసాగుతున్న వీరు గ్రేడు–4తో పదోన్నతి కల్పించి ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ వివరించారు.

యువతికి లైంగిక వేధింపులు

ఆళ్లగడ్డ: పట్టణంలోని రామాలయం వీధిలో నివాసం ఉండే యువతిని అదే వీధికి చెందిన యువకుడు గురువారం రాత్రి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. యువతి ఇంటిముందు నిల్చొని ఉండగా యువకుడు దగ్గరకు వచ్చి లైంగిక వేధింపులకు పాల్పడుతుండగా ఆమె గట్టిగా కేకలు వేసింది. యువకుడు పారిపోతుండగా యువతి కుటుంబ సభ్యులు వెంట పరుగెత్తారు. యువకుడి ఇంటి వద్దకు వెళ్లి నిలదీయగా అతడి కుటుంబ సభ్యులు ఎదురు తిరిగి వాగ్వాదానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అంతలో పట్టణ ఎస్‌ఐ జయప్ప ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ ఈ వీధిలో ఆకతాయిల చర్యలు రోజురోజుకు అధికమవుతున్నాయని, ఒంటరిగా బయట నిల్చోవాలన్నా భయంగా ఉందని ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన.. పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.12,700ల నగదు స్వాధీనం

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో సోదాలు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న నందిరెడ్డి హజరత్‌రెడ్డి, పిచ్చల వెంకటేశ్వరెడ్డి, అట్ల రవితోపాటు మరో 8 మందిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి రూ.12,700లు నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- రీ సర్వేను తర్వగా పూర్తి చేయండి
- జిల్లాలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల: హౌసింగ్ పథకం కింద జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్, స్వామిత్వ కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు, అమలు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజు రోజుకు పురోగతి కనిపించేలాగా చర్యలు చేపట్టాలని, పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు హౌసింగ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. ముఖ్యంగా గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాల్యుడేషన్ సర్వే జాగ్రత్తగా చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో భూ రికార్డుల స్వచ్ఛీకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులన్నీ పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షపు నీరు భూమిలో ఇంకేటట్లు నీటి సంరక్షణ పనులు చేపట్టి గ్రౌండ్ వాటర్ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా, అంటువ్యాధులు ప్రబలకుండా పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రుణాలను రికవరీ చేయండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉన్నతి పథకం ద్వారా ఇచ్చిన రుణాలను వంద శాతం రికవరీ చేయించాలని డీఆర్‌డీఏ, వెలుగుఅసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లను డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక పీజీఆర్‌ఎస్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సమావేశాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సుస్థిరమైన జీవనోపాదులు ఏర్పాటు చేసుకునే విధంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి వాటిని మానిటరింగ్ చేయాలని సూచించారు. స్త్రీనిధి పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.179.20 కోట్లకు గానూ ఇప్పటి వరకు రూ.29కోట్ల ప్రగతి సాధించారన్నారు. నంద్యాల జిల్లాలో 7.94 శాతం ఎన్‌పీఏ ఉందని, దీనిని రికవరీ చేయించాలని చెప్పారు. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మొబైల్ బుకింగ్ 2.0వర్షన్ తీసుకొచ్చిందని ఇందులో సభ్యులు తీసుకున్న రుణాల వివరాలను వెలుగు సీసీలు, వీఓఏలు నమోదు చేయాలని, ఇందుకు వచ్చే నెల 20వ తేదీ వరకు గడువుందని వివరించారు. సమావేశంలో 29 మండలాల ఏపీఎంలు, డీపీఎంలు రంగారావు, హనుమాన్ నాయక్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉల్లాస్.. అక్షరాంధ్ర'లో భాగస్వాములవ్వాలి

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి

నంద్యాల: ఉల్లాస్.. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించడంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉల్లాస్.. అక్షరాంధ్ర కార్యక్రమంపై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 3,02,050 మంది వయోజన నిరక్షరాస్యులను గుర్తించారన్నారు. మొదటి విడతలో ఈ ఏడాది 1,00,686 మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కో వలంటీర్ టీచర్‌కు 10 మందిని కేటాయించి, ఈనెల నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 వరకు వంద గంటల తరగతులు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన వారికి 2026 మార్చిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ న్యూ ఢిల్లీ వారి నుంచి ధ్రువపత్రాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పనిచేసిన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు కూడా ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీఈఓ జనార్దన్ రెడ్డి, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీఎల్‌డీఓ శివారెడ్డి, వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎంఆర్‌కు మూడు ప్రాజెక్టులు


రీసెర్చ్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు మూడు ప్రాజెక్టులు ఎంపికైనట్లు నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వల్పకాలిక విద్యార్థి కార్యక్రమం పరిశోధనలో ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించడంలో భాగంగా ఐసీఎంఆర్ చొరవ తీసుకుంటుందన్నారు. మైక్రోబయాలజీ విద్యార్థి నిఖిల్, డాక్టర్ సచిన్ సుమంత్ మార్గదర్శకత్వంలో, కమ్యూనిటీ మెడిసిన్ విద్యార్థి నీలేష్ కుమార్ గుప్తా, డాక్టర్ హేమలత మార్గదర్శకత్వంలో, ప్రసూతి శాస్త్రం, గైనకాలజీ విద్యార్థి వ్యోమసుధ, డాక్టర్ సుధారాణి మార్గదర్శకత్వంలోని మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. రీసెర్చ్‌కు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్లు రాజశేఖర్, కళావతి, డాక్టర్లు అరుణ, నిరంజన్ తదితరులు అభినందించారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి గురువారం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బి.రామారావు రూ.1,11,116 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.